క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు గణపవరం విద్యార్థి ఎంపిక


పన్నాసి సురేష్

గణపవరం: గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి చదువుతున్న పన్నాసి సురేష్‌కు జాతీయ స్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో పాల్గొనే అవకాశం లభించింది. ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకూ ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయపూర్‌లో నిర్వహించే జాతీయస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో సురేష్ పాల్గొంటున్నాడు. గత నెలలో రాష్ట్రస్థాయిలో కాకినాడ జిల్లా పిఠాపురంలో నిర్వహించిన సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో గెలిచి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థికి శిక్షణనిచ్చిన పీడీ పద్మావతిని ఎంఈవోలు పుచ్చల శేషు, జి.బాలయ్య, హెచ్ఎం మూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

అపరాల పంట పరిశీలన


కొత్తూరులో అపరాల పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి ప్రదీప్‌కుమార్

పెదపాడు: మండలంలోని అపరాల పంటను మండల వ్యవసాయ అధికారి ప్రదీప్ కుమార్ అపరాల పంటలను పరిశీలించారు. పెసర పంటలో పల్లాకు తెగులు ఉధృతి ఎక్కువగా ఉండటంతో దీని నివారణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పల్లాకు తెగులు తెల్లదోమ వ్యాప్తి చెందుతోందన్నారు. తెల్లదోమ నివారణకు ఇమిడా క్లోప్రిడ్ మందును పిచికారీ చేసుకోవాలని, పల్లాకు తెగులు నివారణకు థయోమెథాక్సమ్ మందును పిచికారీ చేయాలని మండల వ్యవసాయ అధికారి రైతులకు సూచించారు. దీంతోపాటు వేప నూనె ఎకరానికి లీటరు చొప్పున పిచికారీ చేస్తే రసం పీల్చు పురుగుల ఉధృతిని కొంత మేర తగ్గించుకోవచ్చునని తెలిపారు. తెగుళ్లను ప్రాథమిక దశలోనే గుర్తించి నివారణ చర్యలు తీసుకుంటే పంటలను రక్షించుకోవచ్చని ఆయన అన్నారు.

స్పీడ్ హంటర్‌తో వాహనాల వేగం నిర్ధారణ


స్పీడ్ హంటర్‌తో వాహనాల వేగాన్ని నిర్ధారిస్తున్న ఎస్సై స్వామి, ఎంవీఐ నాయక్

దెందులూరు: జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణ, వాహనాల వేగం నిర్ధారణకు దెందులూరు ఎస్సై కే.స్వామి, ఏలూరు ఎంవీఐ నాయక్ శుక్రవారం స్పీడ్ హంటర్‌ను వినియోగించారు. వాహనాల వేగాన్ని నిర్ధారించి నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించారు. వాహనాల డ్రైవర్లతో ఎస్సై స్వామి మాట్లాడుతూ అతివేగం వల్ల ప్రమాదాలు నమోదవుతున్నాయని, ప్రతి ఒక్కరూ సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరాలంటే నిర్ణీత వేగాన్ని పాటిస్తూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని అన్నారు.

26న ట్రాక్టర్ల ర్యాలీ

ఏలూరు (టూటౌన్): కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసగించిందని సంయుక్త కిసాన్ మోర్చా – కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు విమర్శించారు. స్థానిక ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పలువురు రైతు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా రిపబ్లిక్ డే సందర్భంగా ఈ నెల 26న ఏలూరులో నిర్వహిస్తున్న రైతులు, కార్మికులు ట్రాక్టర్లు, బైకుల ర్యాలీను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏపీ రైతు సంఘం, ఏఐకేఎంఎస్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, బీకేఎంయూ, కాంగ్రెస్ కిసాన్ సెల్, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు కె.శ్రీనివాస్, పోరండ్ల శ్రీనివాస్, ఎ.రవి, పి.రామకృష్ణ, కేపీఎస్ మూర్తి బండి వెంకటేశ్వరరావు, రాజనాల రామ్మోహనరావు, బి.సోమయ్య, రెడ్డి శ్రీనివాస డాంగే తదితరులు మాట్లాడారు.

యువకుడిపై వేధింపుల కేసు

ఏలూరు టౌన్: ఏలూరు నగరానికి చెందిన ఒక యువతి (16)ని గతంలో స్నేహంగా ఉండే మరో యువకుడు వేధింపులకు గురి చేయడంతో ఏలూరు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరులోని ఓ ప్రాంతానికి చెందిన ఆ యువతి చదువుకునే సమయంలో ఏలూరుకు చెందిన ఆనంద్ స్నేహంగా ఉండేవాడు. వీరిద్దరూ ఫొటోలు పంపుకున్నారు. అనంతరం ఆమె ఉన్నత చదువుల నిమిత్తం విశాఖపట్టణం వెళ్లింది. ఇటీవల పండుగ సందర్భంగా ఏలూరు రావడంతో ఆమెతో మాట్లాడాలంటూ ఏలూరు మినీబైపాస్ రోడ్డులోని ఒక గార్డెన్స్‌కు పిలిపించాడు. తాను చెప్పినట్టు వినకపోతే తన ఫొటోలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. బాధితురాలు ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై మదీనాబాషా కేసు దర్యాప్తు చేపట్టారు.

బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చరిత్రాత్మకం

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- విజయవాడకు తరలిన దళిత, బడుగు, బలహీన, మైనార్టీ వర్గ ప్రజలు



పెదపాడు: కలపర్రులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి


దెందులూరు: విజయవాడ బయలుదేరిన అలుగులగూడెం గ్రామస్తులు, కామిరెడ్డి నాని

పెదపాడు: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చరిత్రాత్మక ఘట్టమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సామాజిక న్యాయ మహా శిల్పం ప్రారంభోత్సవానికి వెళ్తున్న వాహనాలను కలపర్రు టోల్‌గేటు వద్ద ఆయన జెండా ఊపి ప్రారంభించారు. తొలుత ఆయన కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని విజయవాడ నగరం మధ్యలో ఏర్పాటు చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు దెందులూరు నియోజకవర్గం నుంచి భారీగా బస్సుల్లో కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలివెళ్లడం ఎంతో ఆనంద దాయకమన్నారు. అబ్బయ్య చౌదరి ఆధ్వర్యంలో సుమారు 50 బస్సులు, 150 కార్లలో ర్యాలీగా బయలు దేరి వెళ్లారు. విజయవాడ వెళ్లేవారందరికీ కలపర్రు టోల్ ప్లాజా వద్ద భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, ఏలూరు మండల కన్వీనర్ ఎస్సీ సెల్ నాయకుడు తేరా ఆనంద్, పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, దెందులూరు మండల కన్వీనర్ కామిరెడ్డి నాని, ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, నిట్టా గంగరాజు, బత్తుల ఏసురాజు, వట్రపు కోటిరెడ్డి, బెజవాడ శేఖర్, ఎస్సీ, బీసీ సామాజికవర్గ నాయకులు నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు నాయకులు, అభిమానులు భారీగా తరలి వెళ్లారు.

భారీగా తరలిన నాయకులు

దెందులూరు: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి నాలుగు మండలాల నుంచి వేలాది మంది బస్సులు, ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాలపై విజయవాడకు శుక్రవారం తరలివెళ్లారు. దెందులూరు మండలంలో కొవ్వలిలో ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, అలుగులగూడెంలో జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, జోగన్నపాలెంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు గొల్ల కిరణ్ ఈ సందర్భంగా విజయవాడ తరలివెళ్లే వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు కట్టా ఏసుబాబు, చల్లా మేరిరాజు, కొంగర రత్నకుమార్ అబ్బాస్, వాసే డొమినిక్, తలారి రామకృష్ణ, గొల్ల వీరాస్వామి, వైఎస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, ఏసుబాబు, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వెళ్లే నాయకులకు సంఘీభావం ప్రకటించారు. అన్ని గ్రామాల్లో అంబేడ్కర్ చిత్రాలతో ఉన్న జెండాలను కార్లపై, ద్విచక్ర వాహనాలపై ఉంచి ర్యాలీగా వెళ్లారు.


ఉంగుటూరు: విజయవాడ వెళుతున్న బస్సుకు జెండా ఊపి ప్రారంభిస్తున్న మంగరావు, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి


భీమడోలు: గుండుగొలనులో సమతా సంకల్ప సభకు తరలిన బస్సులకు జెండా ఊపి ప్రారంభిస్తున్న ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు


నిడమర్రు: బువ్వనపల్లి నుంచి బస్సుల్లో విజయవాడ వెళుతున్న అంబేడ్కర్ అభిమానులు


గణపవరం: వెంకట్రాజపురం నుంచి విజయవాడ వెళ్తున్న దళిత నాయకులు

వాహనాల్లో పయనం

ఉంగుటూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఉంగుటూరు నియోజకవర్గం నుంచి జనం తరలివెళ్లారు. మండలంలోని 25 సచివాలయాలకు సంబంధించి 10బస్సులపై అభిమానులు తరలివెళ్లారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మరడ మంగరావు, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి జెండా ఊపి బస్సు ప్రయాణాన్ని ప్రారంభించారు. కైకరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ అధ్యక్షుడు పుప్పాల గోపి పాల్గొన్నారు.

భీమడోలు మండలంలో..

భీమడోలు: సామాజిక న్యాయం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సాధ్యమని గుండుగొలను ఉపసర్పంచ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ముదుండి సూర్యనారాయణరాజు అన్నారు. విజయవాడలోని స్వరాజ్ మైదాన్‌లో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ తరుణంలో సామాజిక సమతా సంకల్ప సభకు భీమడోలు మండలంలోని 13 గ్రామ పంచాయతీల నుంచి 9 ఆర్టీసీ బస్సుల్లో స్వచ్ఛందంగా బడుగు, బలహీన వర్గాలకు చెందిన యువకులు, మహిళలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. గుండుగొలను నుంచి బయలు దేరిన ఆర్టీసీ బస్సులకు జెండా ఊపి ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణ ప్రారంభించారు. కార్యక్రమాల్లో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బువ్వనపల్లి నుంచి బస్సుల్లో పయనం

నిడమర్రు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో శుక్రవారం ప్రారంభించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో నిడమర్రు మండలం నుంచి రెండు బస్సుల్లో అంబేడ్కర్ అభిమానులు, ఎస్సీ, ఎస్టీ సోదరుల బయలు దేరి వెళ్లారు. బువ్వనపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బస్సులకు వైఎస్సార్ సీపీ మండల బాధ్యుడు పుప్పాల కన్నబాబు జెండా ఊపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కోడే కాశి, మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తదితరులున్నారు.

30 బస్సులలో విజయవాడకు..

గణపవరం: విజయవాడలో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్న సామాజిక న్యాయశిల్పం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి గణపవరం మండలం నుంచి ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, దళిత సంఘాల నేతలు భారీఎత్తున తరలివెళ్లారు. సుమారు 30 బస్సులతోపాటు, కార్లు, మోటార్‌సైకిళ్లపై పిప్పర, మొయ్యేరు, వెంకట్రాజపురం, గణపవరం, సరిపల్లె, అర్ధవరం, చిలకంపాడు, జల్లికాకినాడ గ్రామాల నుంచి నాయకులు తరలి వెళ్లారు.

‘ఆడుదాం.. ఆంధ్ర’ యువతకు వరం

గణపవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం గ్రామీణ యువతకు, విద్యార్థులకు వరమని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల్లో మండల స్థాయిలో వివిధ ఆటల పోటీల్లో విజేతలకు ఆయన మండల పరిషత్ కార్యాలయంలో షీల్డులు, బహుమతులు అందజేశారు. మానసిక, శారీరక ఆరోగ్యానికి క్రీడలు దోహదం చేస్తాయని ఆయన అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తోందని, త్వరలోనే మండలానికో మినీ స్టేడియం నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తుందన్నారు. ప్రతి పాఠశాలలోనూ విద్యార్థులు ఆటలు ఆడే విధంగా చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రికెట్, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ వంటి 5 రకాల పోటీలను నిర్వహించామని ఎంపీడీవో జ్యోతిర్మయి తెలిపారు. మండల స్థాయిలో బాలురు, బాలికల విభాగాలలో విజేతలైన 10 జట్లను నియోజకవర్గ స్థాయిలో ఈనెల 24వ తేదీ నంచి ఉంగుటూరులో నిర్వహించే పోటీలకు ఎంపిక చేసినట్లు ఆడుదాం ఆంధ్ర మండల కోఆర్డినేటర్ ఎం.పద్మావతి తెలిపారు. విజేతలకు ఎమ్మెల్యే చేతులమీదుగా షీల్డులు, ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆడుదాం ఆంధ్ర పోటీల నిర్వహణలో పాల్గొన్న పీడీలు కె. శ్రీనివాసరెడ్డి, ఎం.పద్మావతి, ఆర్ శ్రీనివాసకుమార్, నక్కా సత్యనారాయణ, ఆర్.సీతారామ్, ఏవీవీ ప్రసాద్, జి.దివాకర్‌ను ఎమ్మెల్యే దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, ఎంపీడీవో జ్యోతిర్మయి, తహసీల్దార్ పమ్మి లక్ష్మి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

హుషారుగా ఖోఖో పోటీలు

భీమడోలు: భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో మండల స్థాయి ఖోఖో పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసాయి. మండల వ్యాప్తంగా 16 ఖోఖో టీములు క్రీడా పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. తొలుత వివిధ గ్రామ పంచాయతీల నుంచి ఖోఖో ఆడేందుకు వచ్చిన యువతులను ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ పరిచయం చేసుకుని వారిని అభినందించారు. అనంతరం పూళ్ల 2, భీమడోలు 3 యువతులకు నిర్వహించిన ఖోఖో పోటీలు హోరాహోరీగా జరిగాయి. పూళ్ల 2 జట్టు సత్తా చాటి విజేతగా నిలిచింది. నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 20వ తేదీన షటిల్ బాడ్మింటన్ పోటీలను ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతాయని కోఆర్డినేటర్ వి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై వెంకటేశ్వరరావు, పీడీలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


గణపవరం: ఆడుదాం ఆంధ్రలో మండల స్థాయి విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు


దెందులూరు: మహిళా కబడ్డీ జట్టు


దెందులూరు: పురుషుల కబడ్డీ జట్టు


ఖోఖో పోటీలను పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఏఎస్సై వెంకటేశ్వరరావు

ఉత్సాహంగా క్రీడా పోటీలు

దెందులూరు: ఆడుదాం- ఆంధ్ర దెందులూరు మండల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు పోతునూరు, కొవ్వలి మధ్య జరిగింది. ఈ పోటీలో పోతునూరు జట్టు విషయం సాధించి దెందులూరు నియోజకవర్గం అర్హత సాధించింది. దెందులూరు మండల మహిళల కబడ్డీ పోటీల్లో కొవ్వలి జట్టు అర్హత సాధించింది. కొవ్వలి మహిళల కబడ్డీ జట్టు ఫైనల్స్‌కు చేరింది. పురుషుల బ్యాడ్మింటన్ పోతునూరు జట్టు నియోకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించింది.

కుల గణన సర్వే ప్రారంభం

భీమడోలు: కుల గణన కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. రాష్ట్రంలో గతమెన్నడూ లేని విధంగా కుల గణన కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టింది. ఈనెల 28వ తేదీ నాటికి ఈ సర్వే పూర్తి చేయాల్సి ఉంది. మండలంలోని 17 గ్రామ సచివాలయాల్లోని 356 మంది వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు 62,957 కుటుంబాల ఇంటింటికీ వెళ్లి పారదర్శకంగా సర్వే చేస్తారు. ఇంటి పెద్ద నుంచి పారదర్శకంగా డేటాను సేకరించి వారి నుంచి వేలిముద్రను తీసుకోవాలి యాప్‌లోని రెండు విభాగాల్లో పొందుపర్చిన అంశాలను కుటుంబ సభ్యుల నుంచి అడిగి వారి వివరాలు సేకరిస్తున్నారు. వారి కులం, వారి ఉప కులాల సైతం యాప్‌లో నమోదు చేస్తున్నారు. దీనితో మండలంలోని పశుపక్ష్యాదులు, వారి ఆస్తి వివరాలు, కులాల వారీగా వారి పూర్తి డేటా తెలుస్తుంది. మొదటి విభాగంలో పశువులు, వారి ఆస్తి పాస్తుల వివరాలు, ఇంటి స్టేటస్ వివరాలు సేకరిస్తారు. రెండో విభాగంలో వారి కులాలను తెలుసుకుని వాటిని నమోదు చేసారు. విధిగా కుటుంబంలోని ఒక వ్యక్తితో వేలిముద్ర వేయించుకుంటారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు వారు వేలిముద్రను వేస్తారు. శుక్రవారం భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి కుల గణనను పరిశీలించి వారికి పలు సూచనలందించారు. ఈనెల 28కి సర్వే పూర్తి చేయాలని వారికి ఆమె తెలిపారు.


భీమడోలులో కుల గణన సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి

ఆరోగ్యశ్రీలో రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం

నిడమర్రు: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ హాస్పిటల్స్‌లో రూ.25 లక్షల వరకూ ఉచిత వైద్యం ప్రభుత్వం అందిస్తోందని ఎంపీడీవో, ఆరోగ్యశ్రీ నోడల్ అధికారి జి. విజయకుమారి తెలిపారు. శుక్రవారం అడవికొలను గ్రామ సచివాలయం–2లో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఎంపీడీవో విజయకుమారి మాట్లాడుతూ కొత్త స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ శిబిరంలో 380 మందికి వైద్యసేవలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేసారు. 93 మందికి కంటి పరీక్షలు చేసి కంటి అద్దాలు పంపిణీ చేయనున్నారు. ఈ శిబిరంలో సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు పుప్పాల మెహర్‌కుమార్, మండల వైద్యాధికారి కె. భాగ్యశ్రీ, పిల్లల వైద్యనిపుణులు టి.కృష్ణకిషోర్, స్త్రీ వైద్యనిపుణులు మేఘన, కంటి వైద్యులు ఎస్కే బషీర్ తదితరులున్నారు.


జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు

అభివృద్ధి ప్రణాళికలతో సుస్థిర లక్ష్యాలు సాధించాలి

గణపవరం: గ్రామస్థాయిలో ప్రజల అభివృద్ధి సూచిక, సుస్థిర లక్ష్యాలను సాధించే దిశగా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, కార్యదర్శులు ప్రణాళికలు తయారు చేయాలని గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము అన్నారు. గణపవరం మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి గ్రామ పంచాయతీల అభివృద్ధి, ప్రణాళికలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం సాధించాలంటే గ్రామాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలని, ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయన్నారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో అవసరాల ప్రాతిపదికగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఎంపీడీవో జ్యోతిర్మయి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారుచేసే ప్రక్రియను వివరించారు. ముందుగా గ్రామస్థాయిలో వివిధ వర్గాలకు వేర్వేరుగా వార్డు, గ్రామ సర్వేభ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి బాబులు, వైస్ ఎంపీపీ సలాది దుర్గా రత్నకుమారి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, పంచాయతీరాజ్ ఏఈ ముప్పిరిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


గణపవరంలో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ అర్ధవరం రాము

సమస్యల పరిష్కారానికి కృషి

దెందులూరు: రెవెన్యూ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్‌ను శుక్రవారం అమరావతిలో దెందులూరు మండలం గంగన్నగూడానికి చెందిన ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సొంగా రవీంద్రప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లు, శాఖాపరమైన సమస్యలపై వివరించారు. సమస్యల పరిష్కారానికి రెవెన్యూ చీఫ్ సెక్రటరీ హోదాలో తమ వంతు కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రప్రసాద్ కోరారు.

సౌత్‌జోన్ చెస్ పోటీలకు దంత వైద్య విద్యార్థి ఎంపిక

పెదవేగి : సెయింట్ జోసెఫ్ దంత కళాశాల థర్డ్ ఇయర్ చదువుతున్న విద్యార్థి సీహెచ్ నవీన్ 18వ తేదీ డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల్లో నిర్వహించిన చెస్ క్రీడల ఎంపిక పోటీలో డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ తరఫున ఎంపికైనట్లు కరస్పాండెంట్, సెక్రెటరీ ఫాదర్ జి మోజెస్ తెలిపారు. ఈ ఎంపికను డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ ఈ త్రిమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈనెల 26 నుంచి 29 వరకు తిరుచరాపల్లిలో భారతీయ దాస్ యూనివర్సిటీలో సౌత్ జోన్ చెస్ పోటీలను నిర్వహిస్తున్నారని ఆ క్రీడలలో నవీన్ పాల్గొంటారని ఆయన చెప్పారు. ఎంపికైన విద్యార్థిని, ఫిజికల్ డైరెక్టర్ నిట్టా నల్లయ్యను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ స్లీవరాజు, అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఎల్ ఫిలిక్స్, కళాశాల అధ్యాపకులు విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిడమర్రు: బువ్వనపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ లైన్ల నిర్వహణ నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏలూరు ఈఈ నటరాజన్ తెలిపారు. బువ్వనపల్లి, అడవికొలను, చానమిల్లి, క్రొవ్విడి, సిద్దాపురం, ఎనికేపల్లి, బావాయిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కోడిపందేల స్థావరంపై పోలీసుల మెరుపు దాడి

పెదవేగి : కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు తొమ్మిది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ శుక్రవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం కొప్పులవారిగూడెంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేయగా, ఘటనా స్థలంలో 9 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.66,200 నగదు, 4 కోడిపుంజులు, కారు, 3 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

ఉంగుటూరు: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గోపినాథపట్నంలో నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభించనున్న 227వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని మంగరావు కోరారు.